క్లుప్తంగా

బ్రిడ్జి పనుల పరిశీలన



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురం, జానంపేట మధ్య రామ సముద్రం అలుగుపై రూ.3కోట్లతో నిర్మిస్తున్న బ్రిడ్జి, ఇరు పక్కల మట్టిరోడ్డు నిర్మాణ పనులను ఆర్అండ్బీ ఈఈ దేశ్యానాయక్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పనుల్లో నాణ్యతను పాటించి, పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ వేణుగోపాల్‌కు సూచించారు.

హనుమాన్ మాలధారణ ప్రారంభం



గోపాల్‌పేట: మండలంలోని ఏదుల శివారులోని గట్టుపై ఉన్న ఆంజనేయ ఆలయంలో 30 మంది భక్తులు సోమవారం హనుమాన్ మాలధారణ చేశారు. ఇక్కడ 26ఏళ్లుగా మాలధారణ కార్యక్రమం జరుగుతోందని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి మశన్న, తెలంగాణ హనుమాన్ మాల దీక్ష పీఠాధిపతి జయరాం గురుస్వామి, అర్చకులు లక్ష్మీకాంతాచార్యులు, రంగనాథ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని ఆర్టీఏ కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం రోడ్డు భద్రతపై మోడల్ స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సతీష్ మాట్లాడుతూ మైనర్ విద్యార్థులు వాహనాలు నడపరాదని సూచించారు. మద్యం తాగి డ్రైవింగ్ చేయడం, రాంగ్ రూట్, పరిమితికి మించి ప్రయాణికుల తరలింపు సరికాదని తెలిపారు. వేగంగా వెళ్లడంతో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని, హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పక ధరించాలన్నారు. కార్యక్రమంలో పీఈటీ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



మదనాపురం: మండలంలోని నెలివిడికి చెందిన బాలకిష్టన్నకు సోమవారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరయిన రూ.52 వేల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు టీసీ నాగన్న, కోట్ల తిరుపతయ్య, రాంనారాయణ, శ్రావణ్‌కుమార్, వెంకట్‌నారాయణ తదితరులు ఉన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



పాన్‌గల్: మండలంలోని శాగాపూర్ ఎస్సీ, బీసీ కాలనీల్లో కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సహకారంతో మంజూరైన విద్యుత్ స్తంభాలను సోమవారం ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ మౌనికయాదవ్, ఉప సర్పంచ్ లలిత పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తిరుపతయ్యయాదవ్, డా.తిరుపతయ్య, చంద్రయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్తపరీక్షలు

అమరచింత: ఫైలేరియా నిర్మూలనకు ప్రభుత్వం పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులకు రక్త పరీక్షలను నిర్వహిస్తుందని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ శరత్ అన్నారు. మండలంలోని నందిమళ్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఒకటి, రెండు తరగతులు చదువుతున్న చిన్నారుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ల్యాబ్ టెక్నీషియన్ రాజు, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎం హైమావతి తదితరులు పాల్గొన్నారు.



‘కంటివెలుగు’తో పేదలకు మేలు



బొల్లారంలో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కొత్తకోట రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెద్దమందడి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇస్మాయిల్ అన్నారు. సోమవారం పెద్దమందడి మండలంలోని అల్వాలలో కంటివెలుగును సర్పంచ్ సువర్ణ కలిసి వైద్య సిబ్బంది ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ రఘు, ఎంపీటీసీ భార్గవి, ఉప సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, నాయకులు రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వార్డు సభ్యులు శ్వేత, జానకీరాంరెడ్డి, బాల్‌రెడ్డి ఉన్నారు.

అమరచింత: సీఎం కేసీఆర్ ముందుచూపుతో ప్రారంభించిన రెండో విడత కంటి వెలుగు శిబిరాలు నిరు పేదల పాలిట వరంగా మారిందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. మొదటి రోజు 110 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 30 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. అనంతరం కంటి వెలుగు కార్యక్రమంపై కళాజాతా బృందంతో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జీఎస్ గోపి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ఏ రాజు, కమిషనర్ మహమ్మద్ ఖాజా, హెల్త్ సూపర్‌వైజర్లు అయ్యూబ్‌ఖాన్, సురేందర్ గౌడ్ పాల్గొన్నారు.

పాన్‌గల్: అంధత్వ నివారణ కోసం ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గోప్లాపూర్‌లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించి పరీక్షలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గోప్లాపూర్, రేమద్దుల, కదిరెపాడు గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలు కొనసాగుతున్నాయన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఎంపీఓ రాజు పరిశీలించారు. గ్రామంలో 159 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 11 మందికి అద్దాలు అందించారు. 11 మందికి అవసరమైన అద్దాల తయారీకి పంపించామని, 10 మందిని ఆపరేషన్ అవసరం ఉన్నవారిగా గుర్తించామని మండల వైద్యాధికారి రాముడు తెలిపారు. కార్యక్రమంలో వైద్య అధికారి పవన్‌కుమార్, ప్రియాంక, సూపర్‌వైజర్ సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో..

వీపనగండ్ల: బొల్లారం గ్రామంలో ఎంపీడీఓ కతలప్పతో కలిసి ఎంపీపీ కమలేశ్వర్‌రావు కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మమ్మ, ఎంపీటీసీ కవిత, సుదర్శన్‌రెడ్డి, కృష్ణయ్య, అంగన్‌వాడీ టీచర్లు భారతి, నాగేశ్వరమ్మ, తిరుపతమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

‘కులాల మధ్య చిచ్చు పెట్టొద్దు’



మాట్లాడుతున్న పల్లె సత్యనారాయణ

కొత్తకోట రూరల్: ప్రశాంతంగా ఉన్న పెద్దమందడి మండలంలో కులాల మధ్య చిచ్చు పెడితే ఉపేక్షించేది లేదని బీసీ కుల సంఘాల నాయకులు పల్లె సత్యనారాయణ, నాగేంద్రం యాదవ్ స్పష్టం చేశారు. బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ ఆదివారం మండల కేంద్రంలో స్థానిక సర్పంచ్‌పై దాడి చేశారంటూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడటాన్ని ఖండిస్తూ సోమవారం బీఆర్ఎస్, బీసీ సంఘాల నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సగర సంఘం రాష్ట్ర నాయకుడు పల్లె సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామంలోని భూ సమస్యను చట్టపరంగా, గ్రామ పెద్దల సమక్షంలో పరిష్కరించుకుంటారని, రాచాల యుగంధర్‌గౌడ్ స్వార్థం కోసం ప్రతి చిన్న విషయంలో తలదూర్చి పెద్దమందడి మండలంలో కుల చిచ్చు రేపడం ఏంటని ప్రశ్నించారు. పెద్దమందడి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు, బీసీ హాస్టల్‌కు, బైపాస్ రోడ్డుకు భూమి దానం చేసిన జిల్లా రైతుబంధు అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డిని రౌడీ బ్రదర్స్ అని సంబోధించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జానకీ రాములు, సురేష్, వెంకటయ్య, సేనాపతి, రాములు, రాంచంద్రయ్య, రాధాకృష్ణ, లోకేష్, రాజుగౌడ్, కురుమూర్తి, పుల్లన్న, శ్రీనివాసులు, రవి, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని ఆయా గ్రామాల శివారుల నుంచి మట్టి, ఇసుకను అక్రమంగా తరలించే వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సంధ్య హెచ్చరించారు. ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. అక్రమంగా తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయడంతో పాటు యజమానులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

ఆలయాలను అభివృద్ధి చేయాలి



ఖిల్లాఘనపురం: రాష్ట్రంలో శిథిలావస్థలో ఉన్న ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనుజ్ఞారెడ్డి కోరారు. సోమవారం బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి పురుషోత్తం ఆధ్వర్యంలో మహ్మదుస్సేన్‌పల్లికి వెళ్లే దారిలో అల్లిపేట గుట్టపై ఉన్న పద్మనాభస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు గోపాల్, అంజనేయులు, లక్ష్మణ్, అంజనేయులు, కార్తీక్, సురేష్, శివ, శ్రీను, సుధాకర్, రాజు, వెంకటేష్, మహేష్, శివ, మహేందర్, ఆనంద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



అజ్జకొల్లులో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీనివాసులు

పాన్‌గల్: మండలంలోని చిక్కేపల్లికి చెందిన గ్రామ సంఘం సహాయకురాలు రాణి అనారోగ్యంతో మృతి చెందడంతో మండల వీఓఏల సంఘం, జిల్లా సంఘం నాయకులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ 30,500 ఆర్థికసాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని సంఘం నాయకులు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, జిల్లా కోశాధికారి దేవేంద్రం, గోపాల్‌పేట మండల అధ్యక్షుడు బాలరాజు, పాన్‌గల్ మండల అధ్యక్షుడు రాజయ్యగౌడ్, చిన్నంబావి మండల ఏపీఎం మద్దిలేటి, సీసీ నాగరాజు, సంఘం నాయకులు శ్రీను, గోవర్ధన్‌రెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయానికి విరాళం

మదనాపురం: మండలంలోని ఎర్రగట్టు మైసమ్మ ఆలయ అభివృద్ధి కోసం అజ్జకొల్లుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ఆలయ కమిటీ సభ్యుడు నాగన్నకు రూ.5 వేల నగదును అందజేశారు. అనంతరం మండల కేంద్రంలో ఆదివారం జరిగిన కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వెళ్లి గుండెపోటుతో మరణించిన అజ్జకొల్లుకు చెందిన నడిమింటి నరసమ్మ మృతదేహానికి ఆయన నివాళులర్పించారు. అనంతరం మనవరాలు శిరీష రూ.5వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో సుదర్శన్‌గౌడ్, కావలి రాజు, జూరాల రాములు, చెన్నయ్య, సత్తిగౌడ్, గొల్ల రాజు, కృష్ణ, ప్రభాకర్, శివశంకర్, పోతురాజు, రాములు, సందు శేషన్న పాల్గొన్నారు.

చిన్నారికి అవార్డు

పెబ్బేరు రూరల్: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వెల్‌బేబీ షో కార్యక్రమంలో భాగంగా చిన్నారి జీవనకు జిల్లా పరిషత్ చైర్మన్ ఆర్ లోక్‌నాథ్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సోమవారం అవార్డు అందజేశారు. శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్–3లో చదువుకుంటున్న చిన్నారి జీవన జిల్లా కేంద్రంలో వెల్‌బేబీ షోలో పాడిన అమ్మా ఊయ్యాల.. కోన జంపాల అనే పాట పాడి వెల్‌బేబీ అవార్డు దక్కించుకుందని అంగన్‌వాడీ టీచర్ మంజులారాణి తెలిపారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం



వీపనగండ్లలో పదో తరగతి విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు

కొత్తకోట: పట్టణంలోని ఐదు కేంద్రాల్లో 1,026 విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. 1,022 మంది హాజరైనట్లు మండల విద్యాధికారి కృష్ణయ్య తెలిపారు. జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తూ, కేంద్రాల్లో విద్యార్థులకు కోసం ఏర్పాటు చేసిన వసతులను పరీక్షించారు. తహసీల్దార్ బాల్‌రెడ్డి ఉన్నారు.

అమరచింత: ఆత్మకూర్ పట్టణంలో మూడు పరీక్షా కేంద్రాల్లో 636 మంది విద్యార్థులకు 634 మంది విద్యార్థులు హాజరయ్యారు. అమరచింతలోని రెండు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 308 మంది విద్యార్థులకు అందరూ పరీక్ష రాసినట్లు అధి కారులు తెలిపారు. పరీక్షా కేంద్రాలను తహసీల్దార్లు సింధూజ, చాంద్‌పాషా, ఎంఈఓ బాస్కర్‌సింగ్, సీఆర్పీ స్వామి పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసినట్లు సీఐ రత్నం తెలిపారు.

పాన్‌గల్: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలల్లో 220 మంది, బాలికల ఉన్నత పాఠశాలల్లో 140 మంది విద్యార్థులకు అందరూ హాజరైనట్లు ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు అజీమ్‌పాష, శివయ్య పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎస్ఐ నాగన్న ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలను తహసీల్దార్ యేసయ్య, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి సందర్శించారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర, బాలికల పాఠశాలలు, లిటిల్ స్కాలర్స్ పాఠశాల, కస్తూర్బా గాంధీ పాఠశాలలో మొత్తం 609 మంది విద్యార్థులకు 608 మంది పరీక్షలు రాసినట్లు మండల విద్యాధికారి జయరాములు తెలిపారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 161 మంది విద్యార్థులకు 160 మంది హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు.

వీపనగండ్ల: మండల కేంద్రంలో మొత్తం 170 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెంట్ శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఐ రామన్‌గౌడ్ కేంద్రాల వద్ద బందోబస్తును ఏర్పాటు చేశారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి జెడ్పీహెచ్‌లో 198మంది విద్యార్థులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 144మంది విద్యార్థులు మొదటి రోజు పరీక్ష రాసినట్లు పరీక్ష పరిశీలకులు శాంతయ్య, డిపార్ట్‌మెంటల్ అధికారి వేణుగోపాల్ తెలిపారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ సంధ్య, ఎంఈఓ జయశంకర్ పరిశీలించారు. ఎస్ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

గోపాల్‌పేట: బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 239 మంది విద్యార్థులకు 238 విద్యార్థులు హాజరయ్యారు. అలాగే బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 186 మంది విద్యార్థినులకు 181 మంది విద్యార్థినులు హాజరయ్యారు.



కొత్తకోటలో..



పాన్‌గల్‌లో..

విద్యార్థుల ప్రతిభ



అమరచింత: పోషణ పక్వాడ్ సంబరాల సందర్భంగా మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, పోస్టర్ డిజైనింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన అమరచింత విద్యార్థులు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. అమరచింత జెడ్పీఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని హారిక వ్యాసరచనలో మొదటి బహుమతి సాధించింది. అదేవిధంగా హరీష్ పోస్టర్ డిజైనింగ్‌లో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల హెచ్ఎం బలరాముడు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా పరిషత్ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలను అందుకున్నట్లు తెలిపారు.

కొమురయ్యకు ఘన నివాళి



వీపనగండ్ల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం కొమురయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఆదేశించడంతో తహసీల్దార్ పాండునాయక్ తన కార్యాలయంలో కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకాంత్, ఆర్ఐ కురుమూర్తి, జూనియర్ అసిస్టెంట్ రాఘవేందర్, వీఆర్ఏలు మధు, పావని, జయలక్ష్మి, పరమేశ్, అటెండర్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతిని సోమవారం మండల కేంద్రంలో సీఐటీయూ, తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి రాము, తహసీల్దార్ ఏసయ్య, డీటీ చక్రపాణి, ఆర్ఐలు తిరుపతయ్య, మహేష్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం

అమరచింత: ఆత్మకూర్ ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్ చేతుల మీదుగా అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ సింధూజ, కమిషనర్ రమేష్, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కోటేశ్వర్, కౌన్సిలర్లు చెన్నయ్య, రామకృష్ణ, పోషన్న, కోఆప్షన్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు శిఖం భూమి పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



మట్టి వేసిన చెరువు శిఖం భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

పాన్‌గల్: ‘కబ్జా కోరల్లో చెరువు శిఖం భూమి’ అనే శీర్షికన సోమవారం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన రెవెన్యూ అధికారులు తెల్లరాళ్లపల్లితండా చెరువును సందర్శించి శిఖం భూమిలో మట్టి పరిచిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఏసయ్య మాట్లాడుతూ శిఖం భూమిలో మట్టి వేసి ఆక్రమించడానికి యత్నించిన వారికి నోటీసులు అందించడంతో పాటు చెరువు భూమిని స్వాధీనం చేసుకుంటామన్నారు. చెరువు శిఖం భూమి పరిసరాలు ఆక్రమణకు గురికాకుండా హద్దులు ఏర్పాటు చేస్తామని, హద్దులు దాటి శిఖం భూమి పరిసరాల్లోకి వచ్చే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి నర్మద తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యస్థాపకుడు శివాజీ



వనపర్తిలో శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో శివాజీ మహరాజ్ వర్ధంతి, దొడ్డి కొమరయ్య జయంతి కార్యక్రమాలను టీజీఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇటీవల ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బహుజన రాజ్యస్థాపకుడిగా శివాజీ మహరాజ్ దేశ వ్యాప్త కీర్తి గడించారని ప్రజా గాయకుడు రాజారాంప్రకాష్ కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటానికి ఊపిరి పోసిన యోధుడు కొడ్డి కొమరయ్య అన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రాము, రాజేష్, పరమేశ్వరాచారి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: శివాజీ మహరాజ్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, భూమయ్య, పెద్ద అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



గడ్డబస్వాపూర్ అంగన్‌వాడీలో గర్భిణులకు సీమంతం చేస్తున్న టీచర్లు

పెబ్బేరు: మండలంలో అయ్యవారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఆరోగ్య పోషణ పక్వాడాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ లక్ష్మమ్మ మాట్లాడుతూ తల్లులు, పిల్లలు గర్భిణులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తూ కొర్రలు, రాగులు, సజ్జలు, జొన్నలు ఆహారంగా తీసుకోవడం వల్లే కలిగే ప్రయోజనాలు వివరించారు. అలాగే అక్షరాభ్యాసం, అన్నప్రాసన తదితర కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వాతి, ఐసీడీసీ సూపర్ వైజర్ బాలీశ్వరమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, ఏఎన్ఎమ్ నిర్మల పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం వలన చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అన్నారు. పోషక పక్షం ముగింపు సందర్భంగా శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురం అంగన్‌వాడీ–1 కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అన్నప్రాసన చేశారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ–3లో పోషక పక్వాడ్ కార్యక్రమానికి ఏపీఎం చంద్రకళ హాజరయ్యారు. కార్యక్రమంలో కార్యదర్శి జాహంగీర్, అంగన్‌వాడీ టీచర్లు మంజులారాణి, నలేంద్ర పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం

చిన్నంబావి: మండలంలోని గడ్డబస్వాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అంగన్‌వాడీ టీచర్ వేనమ్మ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ మందడి సత్యరాణి, ఉపసర్పంచ్ జింకల మాధవి పాల్గొని దుర్గమ్మ అనే మహిళకు సీమంతం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్‌లో ప్రభుత్వం అందించే పౌష్టికాహారం గుడ్లు, పాలు, ప్రతి రోజు తప్పకుండా తీసుకోవాలని గర్భిణులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్, చెన్నమ్మ, సరళ, అంగన్‌వాడీ ఆయా పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కంఠం భూమిని ఆక్రమిస్తే చర్యలు



పెబ్బేరు: మండలంలోని గుమ్మడంలో సర్వే నంబరు 197, 198లో గల ఎకరా 18 గుంటల గ్రామ కంఠం భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేశారని గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. రిజిస్ట్రేషన్ చేయించుకోని ప్లాట్లు వేసి అమ్ముతున్నారని ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించి భూమిని పరిశీలించారు. గ్రామ కంఠం భూమిని రైతులకు ధాన్యం ఆరబెట్టడానికి, యువత క్రీడల కోసం ఉపయోగపడేందుకు అధికారులు సహకరించాలని గ్రామస్తులు కోరారు. అలాగే డిప్యూటీ తహసీల్దార్ జయసింహ, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంపీఓ రామస్వామి, పంచాయతీ కార్యదర్శి బాలరాజు తదితరులు గ్రామకంఠం భూమిని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు.